క్లుప్తంగా

పచ్చదనంతోనే పర్యావరణహితం



కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు, విద్యార్థినులు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవాల్లో భాగంగా బుధవారం కళాశాల ప్రాంగణంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల ఆధ్వర్యంలో కళాశాల బోటనీ విభాగం, గ్రీన్‌క్లబ్, ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో 50 తులసి మొక్కలు, 50 కదంబ, మహాగని, కొబ్బరి, తురాయి, సీతాఫలం, సపోట వంటి మొక్కలు కళాశాల ప్రాంగణంతో పాటు బాలికల జూనియర్ కళాశాలలో కూడా నాటారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టీఎంఏ నివేదిత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు డాక్టర్ జె.లావణ్య, డాక్టర్ కేఎల్ శిరీష, డాక్టర్ ఎస్.అనురాధ, డాక్టర్ బి.హైమావతి, లైబ్రేరియన్ డాక్టర్ ఎ.ధరణి, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుడికి చేయూత



కార్మికుడికి వెల్డింగ్ మెషీన్ అందజేస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్

కంచరపాలెం: ఎటువంటి ఉపాధి లేక.. ప్రభుత్వ సాయం అందక ఇబ్బంది పడుతున్న కార్మికుడికి 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఆసరాగా నిలిచారు. బుధవారం పార్టీ వార్డు కార్యాలయంలో వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ నేతృత్వంలో ఎర్ర శ్రీను అనే కార్మికునికి కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ సొంత నిధులతో వెల్డింగ్ మెషీన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా ఇప్పటికీ నిరుద్యోగులకు భృతి అందక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వేళంగిణీరావు, పాత్రపల్లి సునీల్ కుమార్, ఈశ్వరీదేవి, ఆదిలక్ష్మి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్‌తో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలి



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నేతలు

బీచ్‌రోడ్డు: గాజాలో మారణకాండ కొనసాగిస్తున్న ఇజ్రాయెల్‌తో భారత ప్రభుత్వం చేసుకున్న వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసుకోవాలని పౌర ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఇజ్రాయెల్ మంత్రి ఈ నెల 8,9,10 తేదీల్లో భారత్‌లో పర్యటించనున్న నేపథ్యంలో బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీరామ్మూర్తి, మానవ హక్కుల వేదిక ప్రతినిధి ప్రొఫెసర్ సుధ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. వెంకటేశ్వర్లు, పౌర ప్రజాసంఘాల వేదిక సమన్వయకర్త పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ గాజాలో శాశ్వత కాల్పులు విరమణ పాటించాలని, మారణకాండకు కారకుడైన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ, ఇతర అధికారులను విచారించి శిక్షించాలన్నారు. ఆకలితో ఉన్న గాజా ప్రజలకి భారత ప్రభుత్వం వెంటనే ఆహార దినుసులు, మందులు అందజేయడంతో వారు కోరిన సహాయం చేయాలన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల ప్రతినిధులు నాగభూషణం, వై. నూకరాజు, రాంబాబు, బేగం, ఈసర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏఐపై అవగాహన

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సమత డిగ్రీ అండ్ పీజీ కాలేజీ ఆధ్వర్యంలో కళాశాలలో బుధవారం కృత్రిమ మేధస్సు (ఏఐ)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అస్యూర్డ్ అసిస్ట్ ఫౌండర్ గౌతమ్ ఆదిత్యన్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు ప్రభావితం చేస్తున్న పలు అంశాల గురించి విద్యార్థులకు వివరించారు. డిజిటల్ మార్కెటింగ్, ఇంటర్‌నెట్, మొబైల్ ఫోన్‌లు, ఇతర డిజిటల్ మీడియా టెక్నాలజీ ప్లాట్‌ఫామ్స్‌లో వచ్చిన మార్పులను, వాటి ఉపయోగాలను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.



లార్వాలను గుర్తించడం ఎలాగో చూపిస్తున్న మలేరియా సిబ్బంది



కాలువల్లో మందు కొడుతున్న జీవీఎంసీ సిబ్బంది



నివాసాల మధ్య దోమల మందు ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

ముందు జాగ్రత్తలే మందు

- దోమల వృద్ధిని అరికడితేనే ఆరోగ్యం
- విస్తృతంగా నిర్మూలన చర్యలు



గృహిణులకు అవగాహన కల్పిస్తున్న మలేరియా సిబ్బంది



వాటర్ ట్యాంకుల్లో దోమ లార్వాలను గుర్తిస్తున్న మలేరియా సిబ్బంది

అల్లిపురం: వర్షాకాలం వచ్చిందంటే దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా జ్వరాలు పొంచి ఉన్నట్టే. దోమ కుట్టడం ద్వారా వ్యాపించే జ్వరాల్లో డెంగ్యూ అతి ప్రమాదకరమైనది. జ్వరం వచ్చాక రక్త పరీక్ష చేయించుకోవడం, చికిత్స ఆలస్యమైతే మరణానికి దారి తీయవచ్చు. ఏటా జూన్ నుంచి అక్టోబర్ వరకు డెంగ్యూ జ్వరాలు ఎక్కువగా సంభవిస్తుంటాయి. ఈ కాలంలో వర్షాలు ఎక్కువగా కురవడం, నీరు ఎక్కడ పడితే అక్కడ నిల్వ ఉండటానికి అవకాశం అధికంగా ఉండటంతో ఇడిస్ దోమలు వృద్ధి చెందుతాయి. ఇవి కుట్టడం వల్ల డెంగ్యూ జ్వరం వస్తుంది. కొద్ది పాటి అవగాహనతో ముందు జాగ్రత్తలు పాటిస్తే ఈ జ్వరం బారిన పడకుండా ఉంచవచ్చు. ఈ మేరకు నియోజకవర్గంలోని జోన్ల పరిధిలో జీవీఎంసీ, మలేరియా విభాగం అధికారులు దోమల నివారణ చర్యలు విస్తృతంగా చేపడుతున్నారు.

దోమలు ఎక్కడ పెరుగుతాయంటే..

డెంగ్యూ జ్వరం బారిన పడకుండా ఉండాలంటే దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం. ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాలకు దోమలు వృద్ధి చెందడంతో డెంగ్యూ జ్వరాలు నమోదవుతున్నాయి. వారానికి ఒక రోజు డ్రైడే పాటిస్తే దోమల పెరుగుదలను నియంత్రించవచ్చు. ఇంటి పరిసరాల్లో వర్షపు నీటి నిల్వలు, ఖాళీ సీసాలు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వస్తువులు, టైర్లు, రుబ్బురోళ్లు, తాగి పడేసిన టీ కప్పులు, బాటిళ్లు, ఫ్రిజ్ వెనుక డ్రిప్ బాక్స్, కూలర్లు, మనీ ప్లాంట్లలో దోమలు పెరుగుతాయి. నీటిని నిల్వ చేసే గోలాలు, కుండీలు, డ్రమ్ములు, ట్యాంకులు తదితర వాటిలో వారానికి పైగా నీటి నిల్వల్లో దోమలు చేరి గుడ్లు పెడతాయి. ఒక్క దోమ 200 నుంచి 250 గుడ్లు వరకు పెడుతుంది. ఇవన్నీ 10 నుంచి 12 రోజుల్లో దోమలుగా వృద్ధి చెంది జ్వరాలను వ్యాప్తి చేస్తాయి.

డెంగ్యూ హాట్‌స్పాట్స్..

సచివాలయాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని, గత మూడేళ్లలో మూడు కంటే ఎక్కువ డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదైన సచివాలయాన్ని హాట్‌స్పాట్‌గా గుర్తించారు. ఆయా హాట్‌స్పాట్స్‌లో కేసులు నమోదు కాకుండా జీవీఎంసీ యంత్రాంగం, జిల్లా మలేరియా విభాగం ప్రత్యేక కార్యాచరణతో దోమల నిర్మూలనకు పని చేస్తున్నారు. గత ఏడాది కంటే డెంగ్యూ కేసుల సంఖ్య ఈ ఏడాది తగ్గుముఖం పట్టినప్పటికీ రానున్న మూడు నెలలు డెంగ్యూ వ్యాధికి అనుకూలంగా ఉండే వాతావరణం కావడంతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తే మేలని అధికారులు సూచిస్తున్నారు.

భీమ్‌నగర్, కొబ్బరితోట ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన..

అల్లిపురం, భీమ్‌నగర్, కొబ్బరితోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ జ్వరాల నుంచి ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో ఆశ వర్కర్లు, మలేరియా సిబ్బంది సంయుక్తంగా ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా, ఇంటి ఆవరణలో పాత టైర్లు, తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు, పాత వస్తువులు నిల్వ ఉండకుండా చూడాలని తెలియజేస్తున్నారు. అలా ఉన్నట్లయితే వాటిలో వర్షపు నీరు నిలువ ఉండి దోమల లార్వాలు వృద్ధి చెందుతాయని వివరిస్తున్నారు.

ఇలా చేస్తే మేలు..

- దోమలు పెరగకుండా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలి.
- వారానికి ఒక రోజు డ్రైడే పాటించి నీటిని నిల్వ చేసే పాత్రలు, గోలాలు, కుండీలు, డ్రమ్ములను శుభ్రం చేసి ఆరబెట్టి మళ్లీ నీరు పట్టుకోవాలి.
- నీటిని నిల్వ చేసే గోలాలు, కుండీలు, ట్యాంకులపై మూతలు పెట్టాలి.
- ఫ్రిజ్ వెనుక డ్రిప్ బాక్స్, కూలర్లను వారానికి ఒకసారి శుభ్రం చేయాలి.
- నీటిలో దోమ లార్వాలు పెరుగుతున్నట్టు గుర్తిస్తే ఆ నీటిని మట్టి లేదా ఇసుకలో పారబోయాలి.
- దోమలు కుట్టకుండా శరీరాన్ని పూర్తిగా కప్పేలా దుస్తులు ధరించాలి.
- ఇంటికి వచ్చే యాంటీ లార్వా సిబ్బందికి సహకరించి దోమల పెరుగుదలను నియంత్రించాలి.

ప్రజలకు విస్తృత అవగాహన

ప్రతి ఏటా జూన్ నుంచి అక్టోబర్ వరకు డెంగ్యూ, మలేరియా జ్వరాల ఉధృతి కొనసాగుతుంది. దోమల వృద్ధిని అరికడితేనే జ్వరాలను నియంత్రించగలం. జీవీఎంసీ యాంటీ లార్వా సిబ్బంది, సచివాలయ ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, జిల్లా మలేరియా విభాగం ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దోమల నిర్మూలన సామాజిక బాధ్యతగా తీసుకుని ప్రతి ఒక్కరూ తమ ఇంటి నుంచి చర్యలు మొదలుపెట్టాలి.

– మురళి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్

ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయొద్దు



విద్యార్థులు, కళాశాల సిబ్బందికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దాబాగార్డెన్స్: పని ఒత్తిడిలో ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయొద్దని ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు హితవు పలికారు. జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) వైజాగ్ ఆధ్వర్యంలో బుధవారం ఏవీఎన్ కళాశాలలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 300 మంది విద్యార్థులకు బీపీ, షుగర్, ఈసీజీ, దంత, కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. స్త్రీల వైద్య నిపుణులు సలహాలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, జేసీఐ వైజాగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్. చరిష్మా, పాస్ట్ జోన్ వైస్ ప్రెసిడెంట్ బి.ప్రభాకర్, కో ఆర్డినేటర్ కేఎంకే రమేష్, వి డెంటల్ హాస్పిటల్, వి హెల్త్‌కేర్ డాక్టర్ అగర్వాల్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణులు సేవలందించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ ఎస్.గౌతమి, వీ డెంటల్ హాస్పిటల్ కార్పొరేట్ మేనేజర్ కె.పృథ్వీరాజ్, కె.తులసి, ప్రమీల, లతీశ తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం

జగదాంబ: పంపు హౌస్ డ్రైనేజీ సంపులో గుర్తు తెలియని మృత దేహం లభ్యమైందని హార్బర్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీ సాయంత్రం 5.30 గంటల సమయంలో కాన్వెంట్ జంక్షన్‌లోని జీవీఎంసీ యూజీడీ పంపు హౌస్ నుంచి చిలకల జంక్షన్ వద్ద ఉన్న 38 ఎంఎల్‌డీ వద్దకు డ్రైనేజీ వాటర్ పంపిస్తున్న సమయంలో పంపు హౌస్ డ్రైనేజీ సంపులో గుర్తు తెలియని మృతదేహాన్ని శివకుమార్ అనే వ్యక్తి గుర్తించి పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు. సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని బయటికి తీయగా దుర్వాసనతో ఉందన్నారు. శరీరంపై ఎటువంటి గాయాలు లేవన్నారు. మృతుడి వయసు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని, నీలం రంగు ట్రాక్ వేసుకుని 5.5 పొడవు, తెలుపు రంగులో ఉన్నట్లు తెలిపారు. సమాచారం తెలిసిన వారు 3440796013, 9942284808 నంబర్లకు తెలియపరచాలని కోరారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డు శివాజీపాలెంలో విఘ్నేశ్వర సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం దసరా ఉత్సవాలకు పందిరి రాట వేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్పల సురేష్ పాల్గొని రాటను ప్రతిష్ఠించారు. దేవీ నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పోటీలతోనే సృజనకు పదును



పోటీలో పాల్గొన్న విద్యార్థినులతో ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవాల్లో భాగంగా ఈ నెల 3 నుంచి 10 వరకు 'టాలెంట్ ఫ్యూజన్–స్కిల్స్ ఫర్ ది ఫ్యూచర్'లో భాగంగా విద్యార్థినులకు పలు రకాల పోటీలు నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. టాలెంట్ ఫ్యూజన్ పేరిట నిర్వహించిన పోటీల్లో డ్రాయింగ్ అండ్ పెయింటింగ్, శారీ డ్రేపింగ్ అండ్ మేకప్, హ్యాండ్ రైటింగ్, సుడోకు, క్రాఫ్ట్, ఫొటోగ్రఫీ అండ్ నెయిల్ ఆర్ట్స్ వంటి రంగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించగా, వారు చక్కటి నైపుణ్యం ప్రదర్శించారని తెలిపారు. పోటీలు నిర్వహించిన అన్ని రంగాలు విద్యార్థుల భవిష్యత్‌కు ఉపాధి కల్పించే రంగాలేనని, పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టేవని చెప్పారు. విద్యార్థుల్లో విద్యతో పాటు సృజనాత్మక ఆలోచనలు కలిగించి, వాటి ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, సీనియర్ అధ్యాపకురాలు డాక్టర్ టీఎంఏ నివేదిత, ఇతర అధ్యాపక బృందం, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆ రోజులే బాగున్నాయి

- బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో 34వ వార్డు ప్రజలు



34వ వార్డులో అవగాహన కల్పిస్తున్న తోట పద్మావతి తదితరులు

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ పాలనే బాగుంది. ఆ రోజులే బాగున్నాయి. ఎవరికీ కరువు బాధ ఉండేది కాదు. వ్యాపారాలు చక్కగా సాగేవి. సమయానికి మగవారు ఇంటికి చేరుకునే వారు. కుటుంబంతో కలసి ఉండేవారు. ఇప్పుడు ఆదాయమూ లేదు.. ఖర్చు చేసే స్థోమతా లేదు అంటూ 34వ వార్డు ప్రజలు వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ముందు వాపోయారు. బుధవారం ఆమె బూత్ నంబర్ 42లో ప్రెసిడెంట్ సురపతి దుర్గారావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి బాబు మోసాల గురించి వివరించారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు, నర్సింగరావు, పిల్లి సత్తిబాబు, సత్యవతమ్మ, జ్యోతి, దానయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

35వ వార్డులో..



కల్లుపాకలు ప్రాంతంలో ప్రచారం చేస్తున్న కనకరెడ్డి తదితరులు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో బుధవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 93వ బూత్ టౌన్ కొత్తరోడ్డు ప్రాంతంలో కార్యకర్తలతో కలిసి ఆయన కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలపై ప్రజలకు వివరించారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుని సంక్షేమ పథకాలు పొందాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ క్యాక్రమంలో పార్టీ జిల్లా సెక్రటరీ ఆదివిష్ణురెడ్డి, సౌత్ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు మళ్ల బుజ్జి, గంగాధర్, నాగిరెడ్డి, నగేష్, దుర్గాప్రసాద్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

గణపతి విందు.. భలే పసందు

- 45 రకాల పదార్థాలతో అన్నసమారాధన
- కొబ్బరితోట వాసుల సందడే సందడి
- బహుమతిగా వెండి వినాయక ఫొటోల బహూకరణ



వెండి వినాయకుడి ఫొటో



భోజనాలు చేస్తున్న భక్తులు

అల్లిపురం: గణపతి విందు.. భలే పసందు అంటూ కొబ్బరితోట వాసులు లొట్టలేసుకుంటూ ఆరగించారు. కొబ్బరితోట ఎస్‌వీపీ నగర్‌లో క్రేజీ బాయ్స్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా బుధవారం సుమారు 2500 మందికి అన్నసమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సుమారు 40కి పైగా పదార్థాలతో విందు ఏర్పాటు చేశారు. వాటితో పాటు ఒక వెండి వినాయక ఫొటో కూడా బహుమతిగా అందజేశారు. ఒక్కొక్కరికి వెలకమ్ డ్రింక్, ఒక లస్సీ, 2 లీటర్ల డ్రింకు బాటిల్, సోడా బాటిల్, వాటర్ బాటిల్, మిల్క్ మరీడా, ఫలూడా, 10 రకాల స్వీట్లు, మూడు ఫ్రై కర్రీలు, 4 గుజ్జు కర్రీలు, బిర్యానీ, పులిహోర, వైట్ రైస్, సాంబారు, పెరుగుచారు, కుల్ఫీ, కోన్ ఐస్ క్రీమ్, హల్వా, జున్ను, సత్యనారాయణ ప్రసాదంతో కలిపి విందు భోజనంలా వడ్డించారు. తిన్నవారంతా ఆహా ఏమి విందు అంటూ సంతృప్తి వ్యక్తం చేశారు.

ఎట్టకేలకు శ్లాబ్



దగ్గరుండి శ్లాబ్ పనులు చేయిస్తున్న జానకీరామ్, రెల్లికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

దాబాగార్డెన్స్: గత ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, గత జీవీఎంసీ కమిషనర్ సృజన హయాంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి. దానిలో భాగంగా జీవీఎంసీ 36, 37 వార్డులకు సంబంధించి బోర్డర్‌గా రెల్లికుల సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్ ఉంది. గత ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్ హయాంలో సంఘ కార్యాలయానికి సంబంధించి నిర్మాణం జరిపారు. అనంతరం 2021లో అప్పటి జీవీఎంసీ కమిషనర్ సృజన, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ కృషి మేరకు కార్యాలయం రెండో అంతస్తులో సామాజిక భవనం ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ కృషితో ఇటీవల పనులు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా 36వ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్ ఆ నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని రెల్లికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ సాక్షి దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై 'అభివృద్ధికి మోకాలడ్డు' పేరిట సాక్షి ఇటీవల కథనం ప్రచురించింది. దీనికి అధికారులు స్పందించి.. శ్లాబ్ నిర్మాణం చేపట్టారు. బుధవారం సామాజిక భవనం రెండో అంతస్తు శ్లాబ్ పనులు పూర్తయ్యాయి. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ, చెన్నా నరసింహమూర్తి, తుపాకుల కనకారావు, మల్లేష్, చెన్నా ప్రసాద్ (బాబు) పాల్గొన్నారు.

దళితుల హక్కుల పరిరక్షణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం



పాదయాత్రలో పాల్గొన్న నాయకులు

దాబాగార్డెన్స్: దళితుల హక్కులు కాపాడడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతా మోహన్ పేర్కొన్నారు. కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర బుధవారం విశాఖ చేరుకుంది. స్థానిక ఎస్సీ సంఘాల నాయకులు వారికి స్వాగతం పలికారు. అనంతరం సరస్వతీ పార్క్ నుంచి ప్రెస్‌క్లబ్ జంక్షన్, డాబాగార్డెన్స్ మీదుగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వరకు రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ సాగింది. ర్యాలీలో పాల్గొన్న చింతా మోహన్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఇచ్చింది ఆర్డర్ కాదని, డైరెక్షన్ అన్నారు. దానిని అడ్డం పెట్టుకుని దళితులను విభజించడం దుర్మార్గమన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా వర్గీకరణ జరగలేదన్నారు. కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజకీయ ప్రయోజనాల కోసం వర్గీకరణ తెచ్చారన్నారు. దేశ సమైక్యత దృష్టిలో పెట్టుకుని ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణ వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు, దాసరి చెన్న కేశవులు, డాక్టర్ రాజేంద్ర, కేబీఆర్ అంబేడ్కర్, సూర్యారావు, ప్రకాష్, శరత్‌బాబు, మంచా నాగమల్లీశ్వరి, గుంజా చింతయ్య, వెంకట్రావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని పాత డెయిరీ ఫామ్‌కి చెందిన జి.అన్నపూర్ణ అనే దాత రూ.లక్ష 116 విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళాల్ని చెక్కు రూపంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావుకి సింహగిరిపై బుధవారం ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం, ఆశీర్వచనంని అధికారులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.